క్లుప్తంగా

రాత్రిపూట రాకపోకలపై నిషేధం

వీరఘట్టం: మండలంలోని కిమ్మి–నడుకూరు సమీప పంట పొలాల్లో ఏనుగులు సంచరిస్తున్నందున ఈ రోడ్డులో రాత్రి పూట రాకపోకలను నిషేధించినట్లు ఎస్సై ఎం.హరికృష్ణ ఆదివారం తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళ వాతావరణం చల్లగా ఉంటుండడంతో ఏనుగులు రోడ్లపైకి వస్తున్నాయని, అందుచే ఈ రోడ్డులో రాత్రి పూట రాకపోకలు తాత్కాలికంగా నిషేధించినట్లు చెప్పారు. ఈ విషయాన్ని గ్రామస్తులు గమనించాలని కోరారు. ఏదైనా అత్యవసరమైతే పోలీసుస్టేషన్‌కు ఫోన్ చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీ మహాయజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: పెద్దూరులోని ఆదిత్య రైస్‌మిల్లులో ఆదివారం నవకుండముల గాయత్రీ మహాయజ్ఞంను ఘనంగా నిర్వహించారు. పార్వతీపురంలోని స్వామి సేవాసంస్థ కార్యదర్శి కంచుమోజు రామ్మోహనరావు పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ హేమసుందర ఆచార్యుల ఆధ్వర్యంలో ఈ యజ్ఞంను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన రాజేష్

వీరఘట్టం: సీఎస్‌పీ రోడ్డులో వెంకమ్మ చెరువు వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఒక దానికొకటి ఢీకొనడంతో ఒక బైక్‌పై వెనుక కూర్చున్న చిదిమి గ్రామానికి చెందిన రాజేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ లో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు.

చికెన్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



కాటాను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

వీరఘట్టం: మండలంలోని పలు చికెన్ షాపుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, తూనికలు–కొలతల అధికారులు ఆదివారం తనిఖీలు చేశారు. ఆరు షాపుల్లో కాటాలకు సీళ్లు లేకపోవడం, తూకంలో తేడాలు ఉండడంతో ఆయా షాపుల యజమానులపై కేసులు నమోదు చేశారు. వినియోగదారులకు కచ్చితమైన తూకంతో మాంసం విక్రయాలు చేపట్టాలని, లేదంటే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై బి.రామారావు, తూనికలు–కొలతల అధికారి రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

చర్చి ఫాదర్లకు సన్మానం



ఫాదర్లను సన్మానిస్తున్న ఫాదర్ చార్లిస్

గుమ్మలక్ష్మీపురం: ఇటీవల శిక్షణ పూర్తిచేసుకుని పలు చర్చిలలో ఫాదర్లుగా నియమితులైన సుధీర్, దేవకుమార్, డేవిడ్, జేమ్స్, సనతాన్‌లను క్రీస్తు ఆరాధకులు ఘనంగా సన్మానించారు. మండలంలోని ఎస్.కె.పాడు గ్రామంలోని పునీత రాయప్ప దేవాలయంలో ఫాదర్ చార్లిస్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తపస్సు కాలం(లెంట్ దినాలు) ప్రారంభమై రెండు వారాలు కావడంతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారిని సత్కరించారు. క్రీస్తు సందేశాన్ని ప్రజలకు తెలియజేయాలని ఫాదర్ చార్లిస్ సూచించారు.

పింఛన్ల పంపిణీ 98 శాతం పూర్తి



నేరడి-బిలో వృద్ధుడు నారాయణమూర్తికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఉపేంద్ర

భామిని: మండలంలో ఆదివారం నాటికి వైఎస్సార్ సామాజిక పింఛన్ కానుక పంపిణీ 98.20 శాతం పూర్తయిందని అధికారులు తెలిపారు. మండలంలో 16 సచివాలయాల పరిధిలో మొత్తం 7,066 పింఛన్లు ఉండగా.. ప్రభుత్వం రూ.1,94,20,750లు విడుదల చేసింది. 525 మంది వలంటీర్లు 6,944 మంది లబ్ధిదారులకు రూ.1,90,83,000లు నగదు పంపిణీ చేశారు.

ఎర పంటల సాగుతో సస్యరక్షణ

- ప్రధాన పంటలో అంతరపంటగా ఎరపంటల సాగు
- తెగుళ్ల ఉద్ధృతిని అడ్డుకోవడంలో కీలక పాత్ర



ఉల్లిలో ఎరపంటగా వేసిన కాలీఫ్లవర్, క్యాబేజీ



వేరుశనగలో ఎర పంటగా జొన్న

గరుగుబిల్లి:

పంటల సాగులో సస్యరక్షణ ప్రధానమైనది. తెగుళ్ల నివారణకు పురుగు మందుల వినియోగంతో సాగు ఖర్చు పెరగడంతో పాటు రసాయనాల అవశేషాలు పంట ఉత్పత్తుల్లో చేరి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. సస్యరక్షణలో మెలకువలు పాటిస్తే సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన పంట దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి ఆర్.విజయభారతి సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన పంటలో ఎరపంటలను అంతరపంటలుగా సాగు చేయడం ద్వారా ప్రధాన పంటను ఆశించే పురుగులను నివారించవచ్చని అంటున్నారు.

ఎరపంటల సాగు ఇలా..

- వేరుశనగ, కంది, పత్తి తదితర పంటలను ఆశించే శనగపచ్చపురుగు నివారణకు ప్రధాన పంటలో బంతిపంటను సాగుచేసుకోవాలి. ప్రధాన పంటలో ఎకరాకు 60 నుంచి 100 మొక్కలు వేసుకోవడం ద్వారా శనగపచ్చపురుగు బంతిపూలకు ఆకర్షితమై ప్రధాన పంటకు ఎటువంటి నష్టం చేకూర్చవు.
- వేరుశనగ, పత్తి, కూరగాయల పంటలకు ఆశించే పొగాకు లద్దెపురుగు నివారణకు గాను ప్రధాన పంటలో ఆముదం మొక్కలను నాటుకోవాలి. ఆముదం మొక్కల ఆకులపై లద్దెపురుగులు గుంపుగా చేరి గుడ్లుపెట్టి ప్రధాన పంటకు నష్టం లేకుండా చేస్తాయి. అలాగే వేరుశనగలో ఎకరాకు 30 నుండి 40 పొద్దుతిరుగుడు మొక్కలను వేసుకుంటే పొగాకు లద్దెపురుగులను ఆకర్షిస్తాయి. పత్తిలో పచ్చదోమ నివారణకు అలసంద మొక్కల్ని ఎరపంటలుగా వేసుకోవాలి.
- వేరుశనగ, ఆముదం, జొన్న పంటలకు ఆశించే ఎర్రగొంగళి పురుగు నివారణకు పొలంలో అక్కడక్కడ ఆముదం, జిల్లేడు కొమ్మలను వేసుకోవడం వల్ల ఫలితం ఉంటుంది.
- పెసర, మినుము, పత్తి, మిరప తదితర పంటలకు ఆశించే రసం పీల్చేపురుగుల నివారణకు జొన్న, సజ్జ పంటలను ఎరపంటగా వేసుకోవాలి. దీని వల్ల తెల్లదోమ, తామరపురుగు, పేనుబంక పురుగులను నివారించవచ్చు.
- పక్షులు వాలేందుకు అనువుగా ఎకరాకు 20 పంగల కర్రలను ఏర్పాటుచేస్తే శనగ, వేరుశనగ పంటలకు ఆశించే పురుగులను నియంత్రించవచ్చు. పక్షులు ఈ పంగల కర్రలపై వాలి మొక్కలకు ఆశించిన పురుగులను తినేయడం జరుగుతుంది. దీని వల్ల పంటలో తెగులు ఉద్ధృతిని నివారించవచ్చు.
- ఆముదం నూనె రాసిన పసుపు రంగు పళ్లాను పొలంలో ఏర్పాటుచేస్తే తెల్లదోమ, పచ్చదోమను ఉనికి తెలుసుకోవచ్చు.
- పొలంలో 100 వాట్ల బల్బు వేలాడదీసి దానికింద తొట్టెలో నీరు, ఒకమూత కిరోసిన్ పోయాలి. దీపపు కాంతికి రెక్కల పురుగులు ఆకర్షితమై తొట్టెలోపడి చనిపోతాయి.

సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



జియ్యమ్మవలస: కన్నపుదొరవలసలో ప్రచారం చేస్తున్న పార్టీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు

జియ్యమ్మవలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు కోరారు. పార్టీ నాయకులతో కలిసి ఆదివారం కన్నపుదొరవలస గ్రామంలో సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేపట్టారు. పట్టభద్ర ఓటర్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్న సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. అల్లువాడలో డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు.

కొమరాడ: వైఎస్సార్‌సీపీ తరఫున ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి, ఉత్తరాంధ్ర వాణిని ప్రతిపక్షాలకు తెలియజేయాలని పార్టీ మండల అధ్యక్షుడు ద్వారాపురెడ్డి జనార్దనరావు పిలుపునిచ్చారు. గంగారేగువలస గ్రామంలో ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి సుధాకర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఆయనతోపాటు పార్టీ సీనియర్ నాయకుడు శెట్టి మధుసూదనరావు ఉన్నారు.



జియ్యమ్మవలస: అల్లువాడలో ప్రచారం చేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు



కొమరాడ: గంగారేగువలసలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నల్లరాయిగూడలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని నల్లరాయిగూడకు చెందిన ఆరిక జీవన్(18), తాటిమానుగూడకు చెందిన ఆరిక రాకేష్(14), డోకులగూడకు చెందిన కొండగొర్రి పవిత్ర(16) ఇటీవల మృతి చెందారు. మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీటీసీలు కొత్తకోట చంద్రశేఖర్, పాలక ఉషారాణి, సర్పంచ్‌లో జామి ప్రభాకర్, బిడ్డిక గొయింతి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎరుకుమజ్జి పాపినాయుడు, బిడ్డిక నూకయ్య, బిడ్డిక చిన్నప్రసాద్ ఉన్నారు.

పంటలు ధ్వంసం చేసిన ఏనుగులు



ఏనుగులు ధ్వంసం చేసిన వ్యవసాయ బోరును చూపుతున్న కౌలురైతు తిరుపతి గౌడో

భామిని: మండలంలోని మనుమకొండ సమీపంలో ఆరు ఏనుగుల గుంపు శనివారం అర్ధరాత్రి పొలాల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేశాయి. కాట్రగడకు చెందిన కౌలురైతు తిరుపతి గౌడో సాగు చేస్తున్న ఐదెకరాల వరిపంటను తొక్కేయడంతోపాటు వ్యవసాయ పంపుసెట్‌ను పాడుచేశాయి. అలాగే బత్తిలికి చెందిన రైతులు శాసనపురి చంద్రమౌళి, భానుప్రసాద్ సాహూలకు చెందిన వరిపంటను ధ్వంసం చేశాయి. మరోవైపు నాలుగు ఏనుగుల గుంపు పసుకుడి నుంచి లివిరి మీదుగా కోసలి వైపు వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు చెపుతున్నారు. గతంలో తిష్టవేసిన వంశధార నదీ తీరంలో ఐలమ్మ మామిడితోట సమీపంలోకి చేరాయని అంటున్నారు.

గ్యాస్ ధరల పెంపుతో పేదలపై భారం

గుమ్మలక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగ, వాణిజ్య వినియోగ గ్యాస్ సిలెండర్ ధర పెంచేసి పేదలపై భారం మోపిందని జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ అద్దాకుల చిన్నారావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 14.2 కేజీల గృహ వినియోగ గ్యాస్ సిలెండర్‌పై రూ.50లు, 19 కేజీల వాణిజ్య వినియోగ సిలెండర్‌పై రూ.350లు చొప్పున పెంచడంతో వాటి ధరలు వరుసగా రూ.1120, రూ.2,119లకు చేరిందన్నారు. ఎల్పీజీ సిలెండర్ ధరల పెంపుతో పేదలు, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం మోపిందన్నారు. అంతర్జాతీయ ధరలకు తగ్గట్లు నెల నెలా గ్యాస్ ధరలు మార్చుకునే వెసులుబాటును ప్రభుత్వ రంగ చమురు రిటైలర్లకు కేంద్ర ప్రభుత్వం కల్పించడమే ఈ దుస్థితికి కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందిన నిరుపేదలకు ఒక్కో సిలిండర్‌పై రూ.200 సబ్సిడీ అందిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెప్తోందని, కానీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో సబ్సిడీ నగదు జమ కావడం లేదని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

కొమరాడ: గత నెల 22న చోళ్లపదం మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవుకోన పంచాయతీ అంటివలస గ్రామానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. మృతుల కుటుంబాలకు పలువురు దాతలు ఆర్థిక సాయం అందించి తమ పెద్దమనసు చాటుకున్నారు. ఉపాధ్యాయుడు రాగల శ్రీనివాసరావు పలువురు దాతల నుంచి రూ.1.50 లక్షలు సేకరించి ఆ మొత్తాన్ని ఆదివారం మాదిలింగి గ్రామానికి చెందిన క్వీన్స్ ఎన్ఆర్ఐ సీఈఓ తుమరాడు చంద్రమౌళీశ్వరరావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరరావు చేతులమీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో పాలెం సర్పంచ్ మాదలింగి విజయ, కోటిపాం సర్పంచ్ సుంకరి సుగుణ, ఖేర్జిల సర్పంచ్ హిమరిక గంగాధర్, సీపీఎం నాయకులు కొల్లు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన జేసీబీ

జేసీబీ, ట్రాక్టర్ సీజ్

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామ పరిధిలో ఉన్న నడిమి చెరువులో అక్రమంగా చేపడుతున్న మట్టి తవ్వకాలపై జలవనరుల శాఖ అధికారులు ఆదివారం దాడులు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించారు. ఒక జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని డీఈఈ డి.రవికుమార్ హెచ్చరించారు.

అవగాహనతో క్యాన్సర్ దూరం



అవగాహన ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

వీరఘట్టం: ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి రకాలు, లక్షణాలు, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను డాక్టర్ పి.ఉమామహేశ్వరి ప్రజలకు వివరించారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స ద్వారా సులభంగా నివారించవచ్చన్నారు. మద్యం, ధూమపానం, ఖైనీ, గుట్కా వంటివాటి వల్ల క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందని, కాబట్టి ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జూనియర్ సివిల్‌జడ్జి విజయరాజ్‌కుమార్



అంపిలి న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్

పాలకొండ: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి విజయరాజ్‌కుమార్ అన్నారు. మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని అంపిలి గ్రామంలో ఆదివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళల రక్షణ కోసం, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకువచ్చాయని, ప్రతీ మహిళ వాటిని తెలుసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, వారికి ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ సందర్భంగా న్యాయవాదులు సరలాకుమారి, విజయలక్ష్మి మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.సత్యనారాయణ, న్యాయవాదులు మునిస్వామి, ఎస్సై శివప్రసాద్, సర్పంచ్ ఎల్.విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ వాకముడ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు తమ హక్కులు సాధించుకోవాలి

మహిళలు తమ హక్కులు సాధించుకోవాలని సీఐటీయూ మండల కమిటీ అధ్యక్షురాలు బి.అమరవేణి అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఆదివారం 'మహిళల హక్కులు–సవాళ్లు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవేణి మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని, సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎస్.రాజకుమారి, జేవీవీ జిల్లా కార్యదర్శి ఎస్.ఉమామహేశ్వరరావు, శ్రామిక మహిళా సంఘం నాయకులు ఎస్.హిమప్రభ, కె.గౌరీశ్వరి, భాగ్యలక్ష్మి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టణంలోని ఎన్‌కేరాజపురం, వైఎస్సార్ కూడలి వద్ద ఆదివారం ఎస్సై శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్, సరైన ధ్రువపత్రాలు లేని వాహన చోదకులపై అపరాధ రుసుం విధించారు. రోడ్డు భద్రత నిబంధలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. మద్యం, నగదు తరలింపుపై నిఘా పెట్టారు.

హెల్త్ వలంటీర్లను నియమించాలి

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలని గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ఈమేరకు విశాఖపట్నంలో ఆదివారం ఎస్టీ కమిషన్ చైర్మన్ కె.రవిబాబును కలిసి సమస్యను వివరించినట్లు పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించడంతోపాటు కాంట్రాక్ట్ టీచర్లు, సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, గిరిజనులకు సాగుపట్టాలు ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు.

31మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 31మందికి వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలోని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్లసంజీవనాయుడు ఆధ్వర్యంలో రెండవ నంబర్ ప్రాథమిక పాఠశాల వద్ద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ నేత్ర వైద్య శిబిరంలో 31మందికి పరీక్షలు నిర్వహించగా 18మంది శస్త్ర చికిత్సకు ఎంపికైనట్లు ఆప్తాలమిక్ కిరణ్ తెలిపారు. వారిని విజయనగరంలోని వెంకట పుష్పగిరి హాస్పిటల్‌కు తీసుకు వెళ్లి శస్త్ర చికిత్సలు పూర్తిచేసిన తరువాత వారిని తిరిగి పెదపెంకి గ్రామానికి చేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో కె.సుధీర్, కె.సతీష్, పి.భాస్కర్, ఎం.శ్రీను, జి.శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక రేపు

సాలూరు: పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో మంగళవారం ఉదయం పదిన్నర నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు డీఈఈ శంకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేదికలో వినియోగదారులు సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు. అలాగే విద్యుత సమస్యలను 1912 నంబర్‌కు ఫోన్ చేసి కూడా తెలియజేయవచ్చన్నారు.

రేషన్ డోర్ డెలివరీ



గుమ్మలక్ష్మీపురంలో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: ప్రతీ నెల రేషన్ సరుకులు ఇంటి వద్దనే లభిస్తుండటంతో నిరుపేదలైన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూలీ పనులు మానుకొని రోజుల తరబడి రేషన్ బియ్యం కోసం డిపో చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధిదారుల ఇబ్బందులను తొలగించాలనే ఉద్దేశంతో ప్రత్యేక వాహనాల ద్వారా రేషన్ బియ్యాన్ని డోర్ డెలివరీ చేస్తోంది. దీంతో లబ్ధిదారుల వ్యయప్రయాసలు తీరాయి.

ఘనంగా టోకి దేవత పండుగ



ఆకట్టుకున్న గిరిజన మహిళల సంప్రదాయ నృత్య ప్రదర్శన

గుమ్మలక్ష్మీపురం: చాపరాయి బిన్నిడి పంచాయతీ కానసింగి గ్రామస్తులు ఆదివారం టోకి దేవత (గ్రామదేవత) పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్తులు గ్రామదేవతకు అన్నం, పిండివంటలు, పండ్లు నైవేద్యంగా పెట్టి కొత్త వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో భాగంగా గిరిజనులు సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. స్థానిక ఎంపీటీసీ మండంగి శ్రీలక్ష్మి, సర్పంచ్ మండంగి దివ్యభారతి, గ్రామ పెద్దలు టోకి దేవతను దర్శించుకుని పూజలు చేశారు.

ఉచిత మంచినీటి కేంద్రం ప్రారంభం



మంచినీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: వాహనచోదకుల దాహార్తి తీర్చేందుకు పార్వతీపురం పురపాలక సంఘం ప్రధాన రహదారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, స్టేట్ కళింగ వైశ్య బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ లాడే మెహర్ ప్రసాద్ తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి కేంద్రాన్ని (ఆర్ఓప్లాంట్) ఎమ్మెల్యే జోగారావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలన్న దృక్పథం, వారికి అండగా ఉండాలని మంచి మనసు కలిగిన వారిలో వైశ్యులు ఎప్పుడు ముందుంటారని దానికి నేడు తన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసిన ఈ కార్యక్రమమే ఒక చక్కని ఉదాహరణగా చెప్ప వచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, స్టేట్ డైరెక్టర్ మెహర్ ప్రసాద్ ఈ ప్రాంతానికి నిత్యం వచ్చే సాధారణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉచిత మంచినీటి కేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని ప్రశంసించారు. రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, స్టేట్ కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు పొట్నూన శ్రీనివాసరావు, జిల్లా రైస్ మిల్ సంఘం అధ్యక్షుడు కొత్తకోట రమేష్, కళింగ వైశ్య సంఘం సభ్యులు, పెద్దలు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.